

మైదుకూరు ఎమ్మెల్యేపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాపాడు



మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై కేసు నమోదైంది. ఎమ్మెల్యేతో సహా 11 మంది అనుచరులపై పోలీసులు ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం పోలింగ్ సందర్భంగా మండల పరిధిలోని చిన్నగులవలూరులో ఇద్దరు టిడిపి ఏజెంట్లు అయిన కుచ్చుపాప ఉగ్ర నరసింహులు, వినోద్‌లపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో ఇరు వురికి బలమైన గాయాలయ్యాయి. కర్నూలు ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అంది స్తున్నారు. ఈ సంఘటనలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో పాటు మరో పాలగిరి లక్ష్మీ నారాయణరెడ్డి, మనీష్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సగిలి చంద్ర ఓబుళ రెడ్డి, గంజికుంట హర్షవర్ధన్ రెడ్డి, బోర్రా శంకర్ రెడ్డి, ఏరాశి భాస్కర్ రెడ్డి, పాలగిరి చంద్రమోహన్ రెడ్డి, చంగా చంద్ర ఓబుల్ రెడ్డిపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభ్యర్థుల భవితవ్యం భద్రం

పోలీసు రక్షణలో ఇవిఎంలు
19 రోజుల నిరీక్షణకు సిద్ధం
కాకిలెక్కల్లో నేతలు బిజీబిజీ
స్ట్రాంగ్ రూములను పరిశీలించిన అధికారులు

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన నేతల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లో నిక్షిప్తమైంది. ఓటింగ్ యంత్రాలను రిమ్స్ సమీపంలోని మను పాలిటెక్నికల్ కళాశాలకు తరలించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పర్యవేక్షిస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన రెండు పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాలు న్నాయి. వీటి బరిలో నిలిచిన అభ్యర్థులు 19వ రోజులపాటు నిరీక్షించాల్సి వస్తోంది. జూన్ నాలుగు నాటి కౌంటింగ్ ఫలితాలతో స్పష్టత రానుంది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని కడప, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని 13 అసెంబ్లీ స్థానాల బరిలో నిలిచిన ప్రధాన పార్టీలకు చెందిన ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఆయా నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ ఆధారంగా జయాపజయాలను మదింపు చేసుకునే పనిలో నిమగ్నం కావడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 30.54 లక్షల మంది ఓటర్లు తీర్పు నిచ్చారు. కడప పార్లమెంట్ పరిధిలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల పరిధిలో 32 మంది, 13 అసెంబ్లీల పరిధిలో 180 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. వీరిలో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపితోపాటు వైసిపి, కూటమికి చెందిన అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొంది. వైసిపి, టిడిపి మధ్య 11 అసెంబ్లీ స్థానాలు, వైసిపి, కూటమి మధ్య రెండు స్థానాల్లో తీవ్రమైన పోటీ నెలకొంది.

ఎవరి ధీమా వారిదే

కడప జిల్లాలోని పులివెందుల, బద్వేల్ స్థానాలపై వైసిపి ధీమాగా ఉంది. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు అసెంబ్లీ స్థానాలపై టిడిపి ధీమాగా ఉంది. ఇలా ఎవరికి వారి అంచనాలు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వీరిలో ఎవరు గెలిచినా స్వల్ప ఓట్ల తేడాలతో గెలిచే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో నువ్వా నేనా అనే రీతిలో పోటీ నెలకొంది. మదనపల్లి, రాయచోటి స్థానాల్లో టిడిపి ఆశగా ఉంది. తంబళ్లపల్లిలో వైసిపి ధీమాగా ఉంది. రాజంపేట, పీలేరుల్లో హోరాహోరీ పోటీ వాతావరణంలో ఉత్కంఠ నెలకొంది. ఎవరు గెలిచిన స్వల్ప ఓట్ల తేడాలతో గెలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి తరుపున పోటీ పడుతున్న జమ్మలమడుగు, రైల్వేకోడూరు అభ్యర్థులు సైతం హోరాహోరీగా తలపడినట్లు తెలుస్తోంది. గెలుపోటములపై పులివెందుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెజార్టీ తగ్గుదల, కడప, ప్రొదుటూరు, కమలాపురంలో విజయావకాశాలపై పెద్దఎత్తున చర్చనడుస్తోంది.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

వైసిపికి ముచ్చెమటలు

కడప పార్లమెంట్ బరిలో హోరాహోరీ పోటీ నడిచింది. వైసిపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి భూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల మధ్య ముక్కోణపు పోటీని తలపించింది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి తిరుగులేని మెజార్టీతో గెలిచిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ వివేకా హత్య కేసు ప్రధాన ఎజెండాగా మారడం, వైఎస్ కుటుంబంలో చీలిక రావడంతో వైసిపి అభ్యర్థికి ముచ్చె మటలు పట్టిస్తోంది. జమ్మలమడుగు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో టిడిపి ఓటర్లు సైతం షర్మిలకు ఓట్లేసినట్లు కనిపిస్తోంది.

క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచేనో

వైసిపి, టిడిపి నుంచి క్రాస్ ఓటింగ్ ఎవరి విజయావకాశాలను దెబ్బతీస్తుందో తెలియడం లేదు. అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంట్ బరిలో నిలిచిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కడప పార్లమెంట్ బరిలో వైసిపి తరుపున నిలిచిన సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉందా అనేది చర్చనీయాంశంగా మారిందో. రాజంపేట పార్లమెంట్ పరిధిలో కూటమి తరుపున బిజెపి అభ్యర్థిగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి పి.వి మిధున్‌రెడ్డి బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. పీలేరు, తంబళ్లపల్లి, రాజంపేట నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి క్రాస్ ఓటింగ్ నడిచినట్లు తెలుస్తోంది. పుంగనూరు, రాయచోటి, మదనపల్లి, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థి పి.వి.మిధున్‌రెడ్డికి భారీగా ఓట్లు పడినట్లు కనిపిస్తోంది. ఏమైనప్పటికీ క్రాస్ ఓటింగ్ ఏమేరకు ఎవరికి ఏమోతాదులో పడిందనే అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ 2024 సర్వత్రిక ఎన్నికలకు సంబంధించి 7 నియోజకవర్గాల కౌంటింగ్ సెంటర్ (మన్ను కాలేజ్) లో వసతులను పరిశీలించారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసి అనవసర వస్తువులను స్ట్రాంగ్ రూమ్స్‌లో ఉంచకుండా తీయించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు విభాగం వారితో మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్‌లో మూడు లేయర్ల బందోబస్తు వివరాలను పరిశీలించారు. కడప నియోజకవర్గానికి సంబంధించి ఇవిఎం బాక్సులను ఐరన్ రాక్స్ ఇచ్చినటువంటి పోలింగ్ స్టేషన్ నంబర్స్‌పైకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ బృందాన్ని ఏర్పాటు చేసి అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములలో ఇవిఎంలను చేర్చే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతి నియోజకవర్గానికీ సంబంధించి ఇవిఎంలో నంబర్ల డేటాను ఏర్పాటు చేసి వాటి ప్రకారం ఇవిఎం రాక్స్‌లో అమర్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్‌కి ఇవిఎం మిషన్స్ తీసుకువచ్చిన ప్రతి ఒకరికీ అల్పాహారం, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయు విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున హమాలీల కోసం మజ్జిగ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలను ఇచ్చారు. సాయంత్రం లోగా అన్ని ఇవిఎం బాక్సులను ఆ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములలో ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కడప కమిషనర్

జమ్మలమడుగులో ఉద్రిక్తత

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు హౌస్ అరెస్టు
అభ్యర్థులకు భద్రత పెంపు
కొనసాగుతున్న ఉత్కంఠ
144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం సాయంత్రం వెంకటేశ్వర కాలనీలో 116, 117 పోలింగ్ బూత్ వద్ద వైసిపి, కూటమి అభ్యర్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఎంపీ అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి కింద పడిపోవడంతో కూటమి శ్రేణులు ఇటుక రాళ్లతో దాడికి దిగారు. ఈ సంఘటనలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మూలే సుధీర్‌రెడ్డి తలకు రాయి తగిలింది. అక్కడే ఉన్న డిఎస్‌పి యస్వంత్ జోక్యం చేసుకొని ఇరు గ్రూపుల వారిని సర్దిజెప్పి అక్కడి నుంచి పంపించారు. దాడిలో ఆది నారాయణరెడ్డిరెడ్డి, వైసిపికి చెందిన వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. టిడిపి కార్యాలయం నుంచి సోమవారం రాత్రి 9 గంటలకు ఆదినా రాయణరెడ్డిని, భూపేష్ సుబ్బరామిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని దేవగుడికి సెక్యూరిటీతో పంపారు. సుధీర్‌రెడ్డిని నిడిజువ్వికి పంపారు. మంగళవారం మళ్లీ జమ్మలమడుగుకు రావడానికి ఇరువురు పార్టీల అభ్యర్థులు ప్రయత్నం చేయగా సుధీర్ రెడ్డిని ముద్దనూరులో అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే ఇటు వైపు ఆది, భూపేష్‌లను కూడా హౌస్ అరెస్ట్ చేశారు. వారికి 2+2 గన్ మెన్‌లను నియమించారు. మొత్తంపై జమ్మలమడుగులో రాజకీయ ఉత్కంఠ కొనసాగుతుంది. అందులో భాగంగానే 144 సెక్షన్ కొనసాగుతుందని, అవసరమైతే ఫైరింగ్ చేయడానికి కూడా వెనకాడబోమని డిఎస్‌పి హెచ్చరించారు. టిడిపి, బిజెపి, వైసిపి కార్యాలయాల వద్ద పోలీస్ బలగాలు మోహరించాయి.



వైసిపి, కూటమి అభ్యర్థుల కార్యాలయాల వద్ద పహార కాస్తున్న పోలీసులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

జమ్మలమడుగులో 144 సెక్షన్ కొనసాగుతోందని డిఎస్‌పి టిడి యశ్వంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ రోజు సోమవారం తలెత్తిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జమ్మలమడుగులో 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు. టీ బంకులు, దుకాణాల్లో నలుగురు కంటే ఎక్కువ ఉంటే కేసు నమోదు చేస్తామన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, అల్లలు సృష్టించేందుకు ప్రయత్నించినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా లాఠీఛార్జి చేయాల్సి వస్తుందన్నారు. అవసరమైతే ఫైరింగ్ చేసేందుకైనా వెనకాడబోమని ఆయన హెచ్చరించారు. అల్లర్లకు ప్రయత్నిస్తే నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని పేర్కొన్నారు. శాంతిభద్రత దృష్ట్యా పట్టణ ప్రజలు పోలీసు వారికి సహకరించాలని డిఎస్‌పి కోరారు.

వివాదాల పరిష్కారానికి
మధ్యవర్తిత్వమే సరైన మార్గం

- జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

వివాదాలను పరిష్కరించుకునేందుకు మంచి పద్ధతి మధ్యవర్తిత్వం అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో కడప బార్ అసోసియేషన్ సభ్యులకు న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అని పేర్కొన్నారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుంది అని చెప్పారు. విభాగం 89 సిపిసి, ఆర్డర్ 1 రూల్ 10. ప్రత్యామ్నాయ వివాదం స్పష్టత, మధ్యవర్తిత్వ నియమాలు 2017, సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వం రాజీనామా, ప్రాజెక్ట్ కమిటీ నిబంధనలు 2015, మధ్యవర్తిత్వ చట్టం 2023, సెక్షన్ 89 ఆర్డర్స్ X LA, 1C, 1D, XXXII-A సివిల్ ప్రొడక్షన్ కోడ్ 1908, మధ్యవర్తిత్వం, రాజీ చట్టం 1996 స్థాపనలను చేయడానికి నిబంధనలను చేస్తుందని తెలిపారు. మీడియేషన్ యాక్ట్ 2023, సెక్షన్.6, 320 సిఆర్‌పిసి మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎమ్. శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, మధ్య వర్తిత్వ న్యాయవాది చంద్రకాంతమ్మ, బొగ్గుల గుర్రప్ప నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా కారాగారాన్ని సందర్శించిన జడ్జి


ఏమైనా సమస్యలు ఉంటే డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జడ్జి మహిళా కారాగారాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థను, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. అనంతరం ఖైదీల భోజనాలను పరిశీలించారు, ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ జైలర్, మహిళా పారా లీగల్ వాలంటరీలు, మహిళా ఖైదీలు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

800 ఎకరాలలో నేలకొరిగిన అరటి
రూ.10 కోట్లు నష్టం
పరిశీలించిన ఉద్యానవన అధికారి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

సోమవారం సాయంత్రం వీచిన గాలివాన బీభత్సానికి 800 ఎకరాలలో అరటి చెట్లు ధ్వంసమయ్యాయి. రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. మంగళవారం ఉద్యానవనాధికారి రాఘవేంద్ర రెడ్డి పులివెందుల మండలంలో ఇ. కొత్తపల్లి, నల్లపు రెడ్డిపల్లి, ఎర్రబల్లి, నల్లగొండ వారి పల్లి లింగాల మండలంలోని ఇప్పట్ల గ్రామాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల, లింగాల మండల పరిధిలో 200 మంది రైతులకు చెందిన 800 ఎకరాలలో అరటి తోటలు నేలకొరిగాయి. సుమారు రూ10 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లింది అన్నారు. 50 విద్యుత్ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. నష్టపోయిన పంట నష్టాన్ని రైతుల వారీగా అంచనావేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నామని ఉద్యానవన అధికారి తెలిపారు. రైతులు ఎంతో అపురూపంగా కంటికి రెప్పలా కాపాడుకున్న పంట ఒక్కసారిగా నేలకొరగడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. లక్షలు పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికి వస్తున్న సమయంలో ఇలా పంట నాశనం కావడంతో పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయామని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



గాలివానకు ధ్వంసమైన అరటి చెట్లు

మజ్జిగ, మినరల్ వాటర్ పంపిణీ


ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్పొరేషన్ మెయిన్ రోడ్‌లో మానవతా సంస్థ మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం దాత, విశ్రాంత డిఎంహెచ్ఒ ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి సహకారంతో ప్రజలకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. సుమారు 5 వేల మందికి పైగా మజ్జిగ, కూల్ మినరల్ వాటర్‌ను అందజేశారు. వేసవి తగ్గేంతవరకు నిర్విరామంగా కొనసాగిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కడప పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి తమ సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మానవతా డైరెక్టర్స్ రాటాల గోపి, డాక్టర్ అవటాల రామాంజుల రెడ్డి, నారు మాధవరెడ్డి, పి.సుబ్బరాయుడు, నగర అధ్యక్షులు, లక్ష్మీనారాయణ రెడ్డి, సెక్రటరీ రహమత్‌బి పాల్గొన్నారు.

రాక్షస పాలనకు అంతం : 'పుత్తా'

ప్రజాశక్తి-చెన్నూరు

రాక్షస పాలన పోయి చంద్రబాబు నాయుడు పరిపాలన వస్తుందని విజయం తెలుగుదేశం పార్టీ దేనని తమ గెలుపు కోసం పనిచేసిన చెన్నూరు మండలం ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కమలాపురం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తానరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం చెన్నూరు గోసుల కల్యాణ మండపంలో కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెంట్లు ప్రతి బూత్‌లో ఉండి పార్టీ కోసం కష్టపడి పని చేశారని, విజయం మనలను తప్పక వరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.. టిడిపి గెలుపు కోసం ఎండను, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కృషిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకోటి రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకట సుబ్బారెడ్డి (బుజ్జన్న,) రాష్ట్ర రైతు సంఘం నాయకులు గుమ్మల్ల మల్లికార్జున్‌రెడ్డి సీనియర్ మైనార్టీ నాయకులు షబ్బీర్ హుస్సేన్ మండల ఉపాధ్యక్షుడు కుంచం రామకృష్ణారెడ్డి, పొట్టి పాటిరాణా ప్రతాప్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

జూన్ 6 వరకు 144 సెక్షన్


- కడప డిఎస్‌పి ఎం.డి.షరీఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈనెల 14 నుంచి జూన్ 6 వరకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కడప డిఎస్‌పి ఎం.డి షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు-2024 నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించడానికి ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలను నివారించడం కోసం ఈ విధానం అమలు చేస్తున్నామన్నారు. కడప నియోజకవర్గం పరిధిలోని కౌంటింగ్ సెంటర్ మౌలానా అబ్దుల్ కలాం నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మాను) పరిసర ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడడం నేరంగా పరిగణిస్తామని తెలిపారు. బహిరంగ సభలకు ముందస్తు అనుమతులు తప్పనిసరని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో పటాసులను కాల్చడం నిషిద్ధమని పేర్కొన్నారు. ఈ నియమ నిబంధనలు జూన్ 6 వరకు ఉంటాయని తెలిపారు. ఈ నియమ నిబంధనలు ఏ వ్యక్తి అయినా పాటించకపోతే ఐపిసి సెక్షన్ 188 కింద శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు కడప పోలీసు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటే 24 గంటల ముందు లిఖితపూర్వకంగా పోలీసు వారికి అర్జి ఇచ్చి ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు.

సుధీర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి

పట్టణంలోని 116, 117 పోలింగ్ కేంద్రంలో సోమవారం రాత్రి వైసిపి ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డిపై దాడి చేసిన సంఘటనలో నిందితుడు గోనె కృష్ణారెడ్డిని అరెస్టు చేశామని డిఎస్‌పి యశ్వంత్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడతూ కరుణాకర్ రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై ఇటుక పెళ్లతో దాడి చేసి గాయపడిచిన వ్యక్తిని 24 గంటల్లోనే పట్టుకున్నామని చెప్పారు. ప్రజా ప్రతినిధిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. గోనె కృష్ణారెడ్డి గతంలో 2014 సంవత్సరంలో కూడా ఇలాగే దాడి చేశారని పేర్కొన్నారు. క్రైమ్ నెంబర్ 447 కింద అరెస్టు చేశామని తెలిపారు. సమావేశంలో సిఐలు కరుణాకర్, గోపాల్ రెడ్డి, ఎస్ఐలు కల్పన, సుబ్బారావు, తిమోతి పాల్గొన్నారు.

17న మహిళల క్రికెట్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - కడప

ఈనెల 17న కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఉదయం 7:00 గంటలకు సీనియర్స్, అండర్ -23, అండర్-19, అండర్ -15 మహిళా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాల్సిందిగా కోరారు. పై తెలిపిన ఏజ్ గ్రూపులకు సంబంధించి ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రెస్, ఎవరి క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది అన్నారు. ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో, స్టడీ సర్టిఫికేట్, టెన్త్ క్లాస్ మార్కుల జాబితా ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు. అండర్ -23 ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2001 సెప్టెంబర్ 1 తరువాత జన్మించి ఉండాలని, అండర్-19 ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. అండర్ -15 ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 సెప్టెర్ 1 తరువాత గాని లేదా 2011 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలని తెలిపారు.

వెన్నుపోటుదారులపై క్రమశిక్షణ చర్యలు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ద్వారకా నగర్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో ఓటమి తప్పదని భావించిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అంజాద్‌బాషా, ఆయన సోదరుడు అహమ్మద్ బాష దొంగ ఓట్లకు, రిగ్గింగుకు యత్నించారని, ఆ అవకాశం తాము ఇవ్వలేదన్నారు. రెండు పర్యాయాలు ఆయన అలాగే గెలిచి పదేళ్లు అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. గౌస్ నగర్ బూత్‌లో దొంగ ఓట్లు వేసుకునేందుకు ప్రయత్నించి, రాళ్ల దాడి చేయడంతో టిడిపికి చెందిన ఐదుగురికి గాయాలు అయ్యాయని, వాహనాలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. అంజాద్ బాషా సభ్యత, సంస్కారం లేకుండా వీధి రౌడీలా తొడ కొట్టడం, కడపను మాఫియాకు అడ్డాగా మారుస్తామనే విధంగా ఉందన్నారు. తాను కూడా సభ్యత, సంస్కారం మరచినట్లయితే, అంజాద్ బాషా ఏకంగా కడప నుండే వెళ్లాల్సి వస్తుందన్నారు. రాళ్ల దాడిలో టిడిపి కార్యకర్తలు తప్పించుకునే ప్రయత్నం చేశారే తప్ప, రాళ్లు రువ్వ డానికి ప్రయత్నం చేయలేదన్నారు. రెండు పర్యాయాలు అక్రమార్గంలో గెలిచి, అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన అంజాద్ బాషా ఈ ఎన్నికల్లో అధికారం తనదే అని పగటి కలలు కంటున్నారని చెప్పారు. టిడిపి కార్యకర్తలపై జరిగిన దాడిపై కేసు పెట్టి, న్యాయం కోసం న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఆలం ఖాన్‌పల్లిలో పార్టీ కి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కడప అసెంబ్లీ టిడిపి అభ్యర్థి రెడ్డప్ప గారి మాధవి మాట్లాడుతూ వైసిపి నేతలు రెండు, మూడు బూత్‌లు మినహాయించి అన్నింటిలో దొంగ ఓట్లతో గెలవాలని విఫల ప్రయత్నం చేశారని, అడ్డు తగలడంతో దాడికి పాల్పడ్డారని ఆమె మండిపడ్డారు. యువతను మత్తుకు బానిస చేసి, వారి అవసరాలకు వాడుకుంటూ వారి జీవితాలతో ఆటలాడుకోవడం అంజాద్‌బాషాకు ఏ మాత్రం మంచిది కాదని హితవుల పలికారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి మాటాడుతూ కడప 7 రోడ్ల సెంటర్లో జరిగిన సభలో 'జగన్ నన్ను చూసి అంజాద్ బాషకు ఓటు వేయాలని అడిగారని, అంజాద్ బాష ఓటమి జగన్‌కు ముందే తెలిసిపోయింది' అని అన్నారు. కడపలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రెడ్డప్ప గారి మాధవి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



ఉత్సాహం చూపిన ఓటర్లకు ధన్యవాదాలు : రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు ఉత్సాహంగా ఓటేసి ఓటింగ్ శాతాన్ని అత్యధికంగా పెంచిన ఓటర్లకు ధన్యవాదాలు అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రొద్దుటూర నియోజకవర్గంలో 2లక్షల 47వేలు ఓటర్లుండగా ఇందులో 1లక్షా97వేల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, వీరిలో మొదటిసారి ఓటేసిన ఓటర్లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పురుషుల కంటే 7వేల మంది మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఓడినా అంతిమ విజయం మాత్రం ప్రజలదే అన్నారు. ప్రజాతీర్పు అమలవుతుందన్నారు. వారికి కావలసిన ప్రతినిధిని స్వేచ్ఛగా ఎన్నుకున్నారన్నారు. జూన్4 వరకు వేచి చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. 99 శాతం ఉద్యోగులు నిష్పాక్షికంగా వ్యవహరించారన్నారు. 2టౌన్ ఎస్ఐ రామకృష్ణ మాత్రం టిడిపికి తొత్తుగా వ్యవహరించారని ఆరోపించారు. సంజీవనగర్, కృపానగర్, స్వరాజ్య నగర్, బిసి హాస్టల్ బూత్‌లలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని, అతని మీద తగిన చర్యలు తీసుకోవాలని ఇసి, డిజిపి, ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామన్నారు. సరైన రీతిలో ఓటు ప్రక్రియ ముగించేందుకు కృషి చేసిన కలెక్టర్, శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తి నిమగ్నమైన ఎస్‌పికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాలుగు నెలలపాటు తనకు పూర్తిగా సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, చివరిరోజు తన తరుపున కూర్చున్న ఏజెంట్లకు శతకోటి అభివందనాలు తెలిపారు. ఏదైనా సేఛ్చాయుత వాతావరణంలో జరగాలని కోరారు. తనను గెలిపించేందుకు నడుం బిగించిన అభిమానులకు అనంతకోటి అభివందనాలని, ఇందుకోసం జూన్4 వరకు వేచి ఉందామని రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తహశీల్దార్ భీమేశ్వరరావు, ఎస్ఐ అనిల్‌కుమార్, ఎంపిడిఒ సల్మాన్ రాజ్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికలకు సహకరించిన ఓటర్లు, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఇతర శాఖల అధికారులు, మీడియా వ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎలాంటి చిన్నపాటి ఘర్షణలు లేకుండా పోలింగ్ సజావుగా సాగడం ఎంతో సంతోషించదగ్గ పరిణామమని వారు పేర్కొన్నారు.

సిబిఎస్ఇ 'పది' ఫలితాల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల విద్యార్థులు సిబిఎస్ఇ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల యాజమాన్యం మంగళవారం తెలిపింది. సోమవారం పదో తరగతి సిబిఎస్ఇ పరీక్ష ఫలితాలు వెలుపడ్డాయి. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ తెలిపారు. ర్యాంకుల సాధనే లక్ష్యంగా తమ పాఠశాల అంకితభావంతో పనిచేస్తుందని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పేర్కొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎపిజిబిలో రుణాలను రెన్యువల్ చేయించుకుంటున్న రైతులు

ఎపిజిబిలో రుణాల రెన్యువల్


ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఎపిజిబి బ్యాంకులో క్రాప్ రుణాల రెన్యువల్స్ ఉండడంతో మంగళవారం ఎపిజిబి బ్యాంక్‌లో రైతులు సందడితో నిండుకుంది. శాఖ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల పరిధిలో 2700 వందల మంది రైతులు క్రాప్ రుణాలు పొంది ఉన్నారని వారికి ఇచ్చిన తేదీని బట్టి ఆరోజు వచ్చి వారు రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ మాసం నుంచి జూన్‌తో రుణాల రెన్యువల్స్ పని పూర్తవుతుందని పేర్కొన్నారు. రైతులు వారికి ఇచ్చిన రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజ శేఖర్ మాట్లాడుతూ బెంగళూరు నగరంలోని మణిపాల్ ఆసుపత్రిలో ఓ చిన్నారి చికిత్స కోసం రక్తం అవసరమని తమ ఫౌండేషనుకు సమాచారం అందిందని అన్నారు. తమ ఫౌండేషన్ సభ్యులలో ఒక్కరైన అనిల్ కుమార్ ఆ చిన్నారి చికిత్సకు అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాలను నిలబెట్టారని చెప్పారు. తమ ఫౌండేషన్ ద్వారా అనేక సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపరు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సకాలంలో తమ బిడ్డకు రక్తాన్ని అందించిన యంగ్ ఇండియా ఫౌండేషన్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న అనిల్‌కుమార్

'శాన్వి' విద్యార్థుల ప్రభంజనం

రాజంపేట అర్బన్ : సిబిఎస్ఇ 2023-24 గ్రేడ్స్ ఫలితాలలో రాజంపేట మండల కేంద్రంలోని తాళ్లపాక వద్ద ఉన్నటువంటి శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ బచ్చోటి విజయనిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలలో 13 మందికి జిల్లాస్థాయి, 9 మంది ప్రథమస్థానం, 14 ద్వితీయస్థానం, ఇద్దరు తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఈ ఫలితాలలో 94.2 శాతంతో ప్రథమ స్థానంలో శ్రీమిత్ర, 93.2 శాతంతో రెండవ స్థానంలో స్నోహిత, 91శాతంతో తృతీయ స్థానంలో శివలక్ష్మి నిలిచారన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, సిఇఒ శంకర్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ భరత్ కుమార్ రాజు విద్యార్థులను ప్రోత్సహించి, ఉపాధ్యాయులను అభినందించారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి ధర

కిలో రూ.150 - కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పచ్చిమిర్చి ధర భగ్గుమంటోంది. కొని తినకుండానే మంట పుట్టిస్తోంది. నెల రోజుల్లోనే దీని ధర రెట్టింపై కొండెక్కి కూర్చుంది. పచ్చిమిర్చి ధర విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర కొన్నాళ్ళుగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పచ్చిమిర్చి ధర రూ.150 వరకు పలుకుతోంది. ఇదే పరిస్థితి ఇంకా నెల రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఎండలు విపరీతంగా ఉండడంతో మిర్చి పంట పూత రాలిపోతోంది. పూత రాలకుండా నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రైతులు పచ్చిమిర్చి ధర పెరిగినప్పటికీ వాతావరణం అనుకరించడం లేదని రైతులు వాపోయారు. మిర్చి ధర.150 మార్కెట్లో ధర ఉన్నప్పటికీ రైతుల దగ్గర నుంచి రూ.80 నుండి రూ.100లతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల వంటకాల్లో మిర్చి అవసరం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నారు.

విస్తీర్ణం తగ్గడంతోనే ధరలు పెరిగాయి

పచ్చిమిర్చి పంట విస్తీర్ణం తగ్గడం వల్ల స్థానికంగా పచ్చిమిర్చి పంట లభ్యం కాకపోవడం వల్లే ధరలు అమాంతం పెరిగేందుకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పచ్చిమిర్చి మార్కెట్‌కు వచ్చేది. ప్రస్తుతం ధర తగ్గే పరిస్థితి లేదు.

- పుల్లయ్య, కూరగాయల వ్యాపారి, పులివెందుల

పంట సాగుకు అధిక ఖర్చు

మిరప సాగు చేయడానికి అధిక ఖర్చవుతుంది. సాగు ప్రారంభం నుంచి మందులు వాడాలి. ఎక్కువగా తెగులు రావడం, ఎండకు పూత రాలుతోంది. దీని నివారణకు అధిక ఖర్చు చేయాల్సి వస్తుంది. పంట కోతకు కూడా కూలీలు ఎక్కువ అవసరం. కూలీల ఖర్చు కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పంట సాగు చేయడానికి రైతులు పెద్దగా ముందుకు రావడం లేదు.

- జి.మాధవి, రైతు, లింగాల

పచ్చిమిర్చి వాడకాన్ని తగ్గించాల్సి వస్తోంది

వ్యవసాయ పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. పచ్చిమిర్చి ధరలు పెరగడంతో వాడకాన్ని తగ్గించాల్సి వస్తోంది. అన్ని రకాల కూరల్లో పచ్చిమిర్చి ఖచ్చితంగా అవసరం. పెరిగిన ధరతో పచ్చిమిర్చి కొనలేని పరిస్థితి.

- సావిత్రి, వ్యవసాయ కూలీ, పులివెందుల

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - చాపాడు

విపరీతమైన ఎండల తర్వాత వచ్చే వర్షాకాలం శరీరానికీ, మనసుకీ ఎంతో హాయినిస్తుంది. తొలకరి జల్లుకే మట్టివాసన అనిర్వచనీయమైన ఆనందాన్ని కలుగజేస్తుంది. ఈ ఆనందాన్ని పూర్తిగా పొందాలంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా ఎంతో అవసరం. వర్షాకాలం, శీతాకాలం, ఎండాకాలం ఇలా సీజన్ ఏదైనా ప్రజల్ని పలు రకాల వ్యాధులు చుట్టుముడుతూనే ఉంటాయని, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగానే సీజన్ మారినప్పుడు జలుబు, దగ్గు, తుమ్ములు, వాంతులు, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులు సంభవిస్తాయి. ఇవన్నీ కూడా నీరు కలుషితం కావడం కారణంగానే వస్తాయి. నిల్వ ఉన్న నీటిలో బ్యాక్టీరియా, ఫంగస్ వ్యాప్తి చెందుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఈగలు వాలిన ఆహార పదార్థాలను, శీతల పానీయాలను తీసుకోకూదని వైద్యులు సూచిస్తున్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం చాలా మంచిది. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు: ఆహారం తీసుకునే ముందు, వాష్‌రూం వెళ్లిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. ఇంటి పరిసరాలను శభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని సూచిస్తున్నారు. కాచి వడబోసిన నీటినే తాగాలి. డయేరియా వ్యాధి బారిన పడిన వారికి రోజుకు వీలైనంత ఎక్కువగా నీళ్ల తాగించాలి. శుభ్రమైన చోట మాత్రమే మంచినీటిని పెట్టాలి. అలాగే నీటిపై మూత పెట్టడం మరవొద్దు. మంచినీరు ఉంచిన చోట స్నానం చేయడం, బట్టలు ఉతకడం చేయొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఉపయోగించే ముందు కాయగూరలు, పండ్లను శుభ్రంగా కడగాలి. సాధ్యమైనంత వరకు అప్పుడే వండిన ఆహారాన్ని తీసుకోవాలి. రాత్రి పూట నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, ముఖ్యంగా మాంసాన్ని తినొద్దు. భోజనం చేసే సమయంలో చేతులను సబ్బుతో కడుక్కోవాలి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూత పెట్టాలి.

వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం



ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ముందు జాగ్రత్తల తీసుకోవడం వల్ల వీటిని నివారించొచ్చు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయించుకోవడం, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలి. నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఆరోగ్య విషయంలో అనుమానం కలిగితే సమీపంలో ఆసుపత్రికి వెళ్లి వైద్య సహాయం పొందాలి.

- రాజేష్ కుమార్, మండల వైద్యాధికారి, చాపాడు

మైదుకూరులో 85.3 శాతం పోలింగ్

ప్రజాశక్తి - చాపాడు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్‌లో మైదుకూరు నియోజకవర్గంలో 85.3శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా 2,11,855 మంది ఓటర్లు ఉండగా.. 1,79,785 ఓటర్లు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. ఇందులో పురుషులు 1,04,085 మంది ఉండగా, 87,881 మంది, మహిళలు 1,07,765 మందికిగానూ 91,903 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దువ్వూరులో 40,822 మంది ఓటర్లకుగానూ 35,793 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 20,102 మందికి గాను 17,583 మంది, మహిళలు 20,718కి 18,209 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మైదుకూరు మండలంలో 64,323 మందికి గాను 54,621 మంది ఓటు వినియోగించుకున్నారు. పురుషుల్లో 31,605 మందికి 26,655 మంది, మహిళలు 32,717కి 27,966 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. చాపాడు మండల పరిధిలో 32,441 మంది గాను 28,682 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 15,910లో 14,014 మంది, మహిళలు 16,531లో 14,688 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖాజీపేట మండలంలో 42,650 మందికి గాను 34,914 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 20,848కి 16,997 మంది, మహిళలు 21,500కిగాను 17,917 ఓటు హక్కు వినియోగించుకున్నారు. బ్రహ్మంగారి మఠం మండలంలో 31,619 మందికిగాను 25,775 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 15,620కి గాను 12,632 మంది, మహిళలు 15,999కిగానూ 13,143 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆర్ఒ తెలి పారు.



చాపాడు : బారులుతీరిన మహిళా ఓటర్లు

పులివెందులలో 81.34 శాతం పోలింగ్

పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గంలో మొత్తం 2,29,687 ఓట్లు ఉండగా వీటిలో పురుషులు 1,11,727, మహిళలు 1,17,941 ఇతరులు 19 మంది ఉన్నారు. వీరిలా 1,86833 మంది ఓటు వినియోగించుకోగా.. పురుషులు 91,484, మహిళలు 95,339 మంది ఇతరులు 10 మంది ఓటును వినియోగించుకున్నారు. మొత్తం 81.34 శాతం ఓటు హక్కును వినియోగించు కున్నారు. మండలాల వారీగా.. సింహాద్రిపురం మండలంలో 25,942 ఓట్లు ఉండగా పురుషులు 12,539, మహిళలు 13,402. వీటిలో 22,480 మంది పురుషులు, 10,929 మంది మహిళలు. 86.65 శాతం ఓటును వినియోగించుకున్నారు. లింగాలలో 23,175 ఓట్లు ఉండగా.. పురుషులు 11725, మహిళలు 11,990. వీటిలో 21,201 వినియోగించుకోగా.. పురుషులు 10,577 మంది, మహిళలు 10,624 మంది వినియోగించుకున్నారు. మండలంలో 89.40 శాతం మంది ఓటు వేశారు. పులివెందులలో 65,133 ఓట్లు ఉండగా.. పురుషులు 31,091, మహిళలు 34,028మంది. వీటిలో 49,757 వినియోగించుకోగా.. పురుషులు 23,868 మంది, మహిళలు 25,879 మంది, ఇతరులు 10 మంది, 76.39 శాతం మంది ఓటు వేశారు. వేములలో 22,343 ఓట్లు ఉండగా.. పురుషులు 10,985, మహిళలు 11,358 మంది. వీటిలో 19,373 మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. పురుషులు 95,65 మంది, మహిళలు 9,808 మంది ఓటు వేశారు. 86.71 శాతం నమోదైంది. తొండూరు మండలంలో 19,296 ఓట్లు ఉండగా.. పురుషులు 9.482, మహిళలు 9.814. వీటిలో 16,553 వినియోగించుకోగా.. పురుషులు 8,230 మంది, మహిళలు 8,323 మంది ఓటు వేశారు. 85.78 శాతం మంది ఓటు వేశారు. వేంపల్లిలో 45,922 ఓట్లు ఉండగా.. పురుషులు 22,361, మహిళలు 23,558. వీటిలో 35,546 వినియోగించుకోగా.. పురుషులు 17,308 మంది, మహిళలు 18,238 మంది ఓటును వినియోగించుకున్నారు. 77.41 శాతం మంది ఓటు వేశారు. చక్రాయపేట లో 27,336 ఓట్లు ఉండగా.. పురుషులు 13,544, మహిళలు 13,791. వీటిలో 21,923 వినియోగించుకోగా.. పురుషులు 11,007 మంది, మహిళలు 10,916 మంది ఓటు వేశారు. 80.20 శాతం నమోదైంది. అత్యధిక శాతం లింగాల మండలంలో పోల్ కాగా అత్యల్పంగా పులివెందులలో పోల్ అయింది. పులివెందుల నియోజకవర్గంలో మహిళలే అధిక శాతం ఓటు వేశారు.

జమ్మలమడుగులో 86.68 శాతం పోలింగ్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు అసెంబ్లీ పరిధిలో 86.68 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. నియోజక వర్గంలో మొత్తం 2,42,556 మంది ఓటర్లు న్నారన్నారు. ఇందులో పురుషులు 1,02,789 మంది, మహిళలు 1,07,449. ముగ్గురు ట్రాన్స్‌జెండర్స్ ఓటు హక్కును విని యోగిం చుకున్నారన్నారు. మొత్తం మీద 2,10,241 మంది ఓటు వేయగా.. 86.68శాతం పోలింగ్ నమోదైందన్నారు.



ఆర్ఒ ఎ.శ్రీనివాస్

బలిజలపై దాడి అమానుషం

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల్లో బలిజ కులస్తులపై వైసిపి నాయకులు దాడి చేయడం అమానుషమని టిడిపి మండల యూనిట్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో వైసిపి నేతలు ప్రవర్తించిన తీరు దురదృష్టకరమన్నారు. ఎన్నికల్లో టిడిపి ఏజెంట్లను బూత్‌లో నుండి బయటికి వెళ్లండి.. మేము ఓట్లు వేసుకుంటామనడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఈ దౌర్జన్యం, ఈ హుందాతనం టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 2014 నుంచి 2019 వరకు సతీష్‌రెడ్డి ఎందుకు చేయలేదో మాకు అర్థం కావడం లేదన్నారు. వైసిపితో లాలూచీ పడినట్లు మా నాయకుడు లోకేష్ అనడంలో తప్పు లేదన్నారు. బిటెక్ తనయుడు రామిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తనయుడు సాయిరెడ్డి రాజకీ యాల్లో ఎంతో ఉన్నత హోదాతనంగా ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని చెప్పారు. టిడిపిలో ఉన్నప్పుడు వైసిపిలోని బలిజ కులం మీదనే దాడి జరిగిందని, మళ్లీ ఇప్పుడు మీరు వైసిపిలో ఉన్నప్పుడు టిడిపి బలిజ కులం మీద దాడి జరుగినట్లు చెప్పారు. గతంలో గండి చైర్మన్ పదవి కూడా రాకుండా చేశారని తెలిపారు. కాపు జాతి ఉద్యమం చేసి గండిలో సమావేశం పెట్టి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన తర్వాత తప్పదు అనుకోని అప్పుడు ఒక వ్యక్తికి ఇవ్వడం జరిగిందని చెప్పారు. బలిజ కులస్తులపై అసూయ, ద్వేషాన్ని తగ్గించుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి ఫైనాన్స్ ఆర్గనైజర్ నామ వేమా, బలిజ సంఘం నాయకుడు ఎడాల జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతిరెడ్డి శివ



మునిరాజారెడ్డి నివాసం వద్ద ఉన్న పోలీసులు

ముద్దనూరులో సుధీర్‌రెడ్డి.. భారీగా మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంగళవారం ఉదయం నిడ్జివ్విలోని తన నివాసం నుండి ముద్దనూరులో ఉన్న తన మేనమామ మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉన్న ప్రదేశానికి నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు వాహనాలు, బైకుల్లో భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు వెళితే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని పోలీసులు ముందస్తు జాగ్రత్తగా ప్రత్యేక బలగాలను మొహరించారు. ఎమ్మెల్యే జమ్మలమడుగు వెళ్లకుండా పోలీసులు ఆపారు.



మాట్లాడుతున్న దేశాయి తిప్పారెడ్డి

సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయి

ప్రజాశక్తి-మదనపల్లి

వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తిరిగి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గెలిపిస్తాయని మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా అధిక శాతం పోలింగ్ నమోదు కావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, ఎపిఎండిసి చైర్‌పర్సన్ జి.షమీం అస్లాం మాట్లాడుతూ రాష్ట్రంలో వయోవృద్ధులకు, ప్రజలకు అందిం చిన సంక్షేమ పథకాలతో వైసిపికి ఆదరణ వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు డాక్టర్ ఎవి.సుబ్బా రెడ్డి, సర్పంచ్‌లు ఆనంద్ పార్థసారథి, మధుసూదన్, వెలుగు చంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారు

-టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలు కోరుకుంటున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం తన గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపు నెలలో వెలువడే ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరించిన ప్రజలకు, కూటమి పార్టీలలైన జనసేన, బిజెపి, టిడిపి, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు పొరుగు రాష్ట్రాల నుంచి విదేశాల నుంచి సైతం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. గడచిన ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి కానీ, పారిశ్రామిక కారిడార్లు కానీ, ఎంఎన్‌సి కంపెనీలు కానీ మన రాష్ట్రానికి వచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. అరాచకాలు, భూదందాలు, దాడులు, ఇసుక, మైనింగ్ దోపిడీలు చేసి ఆ డబ్బులతో ఎన్నికలలో ప్రజలకు పంచారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చి అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొని ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, సిటిఎం మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, జి.పనికర్‌రెడ్డి, టిడిపి నాయకులు జంగాల వెంకటరమణ, కౌన్సిలర్ గాంధీ , మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ సరళి టిడిపికే అనుకూలం

నిమ్మనపల్లె : భారీ ఓటింగ్ నమోదు టిడిపికి అనుకూలంగా ఉంటుందని, జూన్ 4 వ తేదీ తరువాత రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.వెంకటేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో క్రిష్టియన్ సెల్ అధ్యక్షులు దేవారమేష్, సీనియర్ నాయకులు రాజన్న, అన్వర్ బాషా, నరసింహులు, లోకేష్, సోమశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె అసెంబ్లీ అభ్యర్థి షాజహాన్‌బాషా అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయం అన్నారు.

ఇవిఎంలు జిల్లా కేంద్రానికి తరలింపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల అసెంబ్లీ నియోజవర్గం పరిధిలోని 7 మండలాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఇవిఎంలను మంగళవారం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తుతో కడపలో జిల్లా ఎన్నికల అధికారికి అప్పజెప్పారు. ఎన్నికల సిబ్బంది సెక్టోరియల్ అధికారులు సుదూర ప్రాంతాల్లో ఉన్న అన్ని మండలాల్లోని ఇవిఎంలను జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలకు రాత్రి పొద్దుపోయేంతవరకు బందోబస్తు నడుమ వాటిని తీసుకొచ్చి సంబంధిత అధికారులకు అప్పగించారు. అధికారులకు పార్లమెంటు, అసెంబ్లీ ఇవిఎంలను వేర్వేరుగా వాహనాల్లోకి ఎక్కించి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి భద్రంగా ఆ వాహనాలకు సీలు వేసి జిల్లా కేంద్రంలోని కెఎస్ఆర్ఎమ్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. అక్కడ ఉ జిల్లా ఎన్నికల అధికారులకు పార్టీ అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల సిబ్బందికి అప్పజెప్పారు.